

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-నెల్లూరు :చిన్న కె.ఎస్.ఆర్ పాఠశాలలో సన్‌సైడ్ కాలి 9వ తరగతి చదువుతున్న గురుమహేంద్ర అనే విద్యార్థి మృతి చెందడం బాధాకరమని, ఈ ఘటనపై జిల్లా అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డిపిఒ సుస్మితను కలిసి వినతిపత్రం అందజేశారు.ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చెన్ను,నరేంద్ర మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు పనుల్లో భాగంగా భవనాలు పూర్తి కాకుండా ఉన్నాయన్నారు. పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి ప్రమాదం ఉన్నటువంటి పాఠశాలలకు సంబంధించి తక్షణమే దృష్టి పెట్టి నిర్మాణ పనులు జరిపించాలన్నారు. ఎస్ఎఫ్ఐ నగర నాయకులు జీవన్ ప్రకాష్, యశ్వంత్ పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎల సిఫార్సులకు ఒకే..!

-పోలీసు అధికారుల బదిలీలకు అంతా సిద్ధం
- నేతల వద్ద అధికారుల పడిగాపులు

రాష్ట్ర ప్రభుత్వం పాలనపై కసరత్తు తీవ్రతరం చేసింది.. ఇప్పటికే జిల్లా అధికారులకు సంబంధించిన బదిలీలు ఒక కొలిక్కి వచ్చాయి. జిల్లాలోని ప్రధాన శాఖలకు సంబంధించిన అధికారులను బదిలీ చేయడానికి ఎంఎల్‌ఎలందరూ ఒకే చెప్పడంతో సజావుగా సాగింది. త్వరలో ఉత్తర్వులు రానున్నాయి. ఇప్పుడు జిల్లా పోలీసు శాఖలో ప్రక్షాళన మొదలు పెట్టారు. గత ప్రభుత్వంలో పనిచేసిన సిఐ, డిఎస్‌పిలను మార్పు చేయడానికి సర్వం సిద్ధం చేశారు. నేడో, రేపో జిల్లాలోని పోలీసు అధికారుల బదిలీలు జరుగనున్నాయి. ఆయా నియోజకవర్గాల నుంచి ఎంఎల్‌ఎల సిఫార్సు లేఖలు తీసుకున్న అధికారులకు ఒకే చెప్పారు. కొందరు బయట జిల్లాల నుంచి వస్తుండగా, కొందరు జిల్లాలోనే సర్దుబాటు చేస్తున్నారు. కొందరు పోలీసు అధికారులు ఎంఎల్‌ఎలు, టిడిపి నేతల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నూతన రాష్ట్ర ప్రభుత్వం తమ పాలనపై పట్టు బిగిస్తోంది. గత ప్రభుత్వంలో అనేక శాఖల్లోని అధికారులు అధికారపార్టీకి అనుకూలంగా పనిచేశారనే విమర్శలు మూటగట్టుకున్నారు. కొందరు ఆ పనిచేసినా ,చట్టపరంగా పనిచేసినా అంతా ఒక్కటే అయింది. జిల్లాలోని సమావేశమైన అధికారపార్టీ ఎంఎల్‌ఎలు, ముఖ్యనాయకులు అందరూ అధికారులను బదిలీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జిల్లాలోని సిఐలందరికీ స్థాన చలనం జరగనుంది. డిఎస్‌పిల విషయంలోనూ ఒకరిద్దరికి మినహా మిగిలిన వారిని బదిలీ చేయనున్నారు. నెల్లూరు నగరంలో మంత్రి పి.నారాయణ తమకు అనుకూలమైన అధికారులను సిఫార్సు చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోనూ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సిఫార్సు చేసిన పోలీసు అధికారులకు ఒకే చేసినట్లు తెలిసింది. నెల్లూరు నగర డిఎస్‌పి శ్రీనివాసులురెడ్డిని మాత్రం కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కావలి నియోజకవర్గంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్, ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుకుని జాబితా ఫైనల్ చేసినట్లు తెలిసింది. కోవూరు నియోజకవర్గంలోనూ ఎంఎల్‌ఎ ప్రశాంతిరెడ్డితోపాటు బీద రవిచంద్రతో కొడూరు కమలాకర్‌రెడ్డి, కళ్యాణ్ ప్రత్యేకంగా మాట్లాడిన తరువాత ఓ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి అనుకూలంగా వ్యవహరించారనే చెబుతోన్న ఆయన తమ ప్రాంతంలో ఒక్క అధికారి తనకొద్దని కొత్తవారికి అవకాశం ఇవ్వాలని సిఫార్సు చేసినట్లు తెలిసింది. ఆత్మకూరు ఎంఎల్‌ఎ, మంత్రి రామనారాయణరెడ్డి తమ నియోజకవర్గంలోనూ కొందరు నేతలు చెప్పిన సిఫార్సులతో వారికే అవకాశం కల్పించారు. ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల్లో అందరూ సిఐలకు స్థాన చలనం కల్పించనున్నారు. మొత్తం పోలీసు టీమ్‌ను తమకు అనుకూలమైన అధికారులను నియమించుకోవడానికి టిడిపి నేతలు, ఎంఎల్‌ఎలు సిఫార్సులు చేశారు. అందుకు అనుగుణంగా నేడో, రేపో సిఐల, డిఎస్‌పిల బదిలీలు జరుగనున్నాయి. ఇదే సమయంలో కొందరు పోలీసు అధికారులు ఎంఎల్‌ఎలు, టిడిపి నేతల ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. తప్పులేని క్షమించండి, మీరు చెప్పినట్లు ఇంటూనంటూ ప్రాధేయపడుతున్నారు. మంచి పోస్టింగ్‌లు, పిల్లల చదువులు, ఇలా అనేక విషయాల్లో పోలీసు అధికారులు నేతల చుట్టూ తిరుగుతున్నారు. సామాజిక తరగతి, పనితీరు, గత ప్రభుత్వంలో ప్రవర్తన వంటి కీలకమైన అంశాలను దృష్టిలో పెట్టుకొని టిడిపి నేతలు బదిలీ చేస్తున్నట్లు తెలిసింది.

పై ఓవర్ బ్రిడ్జిపై మరమ్మతులు చేపట్టాలి

సిపిఎం ఆధ్వర్యంలో నిరసన, ధర్నా

రోడ్డుపై ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు /కోవూరు వెంకటేశ్వరపురం పై ఓవర్ బ్రిడ్జిపై మరమ్మతులు చేపట్టి వాహన చోదకుల ప్రాణాలు కాపాడాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో 24 గంటల పాటు జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. సోమవారం సిపిఎం నగర కమిటీ, కోవూరు మండల కమిటీ ఆధ్వర్యంలో పై ఓవర్ బ్రిడ్జిపై ఏర్పడిన గుంతను పూడ్చివేసేందుకు తక్షణమే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సాలుచింతల సెంటర్‌వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ నగర నియోజకవర్గం, 53వ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరపురం పై ఓవర్ బ్రిడ్జి మరమ్మత్తులకు గురికావడంతో గడిచిన 20 రోజుల నుంచి ట్రాఫిక్‌ను జిల్లా అధికారులు మళ్లించారన్నారు. జాతీయ రహదారికి చెందిన ఒక పై ఓవర్ బ్రిడ్జి గుంత పడిందన్న కారణంగా బ్లాక్ చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. పై ఓవర్ బ్రిడ్జిపైన ఒక పెద్ద గుంత పడితే మరమ్మత్తులు చేసేందుకు అధికారులు ప్రయత్నం చేసిన దాఖలాలు లేవన్నారు. కర్నూల్, కడప, జిల్లాలకు వెళ్లాలంటే ఉన్న ఆత్మకూరు, ఉదయగిరి,కోవూరు నియోజకవర్గాలకు చెందిన ప్రజలు ఈ బ్రిడ్జిమీదనే ప్రయాణం చేయాల్సి ఉంటుందన్నారు. సంతపేట మీదుగా, కోవూరు ఇనమడుగు సెంటర్ మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించారే తప్ప బ్రిడ్జి మరమ్మత్తు చేయాలన్న ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు. జిల్లా అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన పై ఓవర్ బ్రిడ్జిమీద ఏర్పడిన గుంతకు మరమ్మత్తులు చేయాలన్నారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ వెంకటేశ్వరపురం పై ఓవర్ బ్రిడ్జి దెబ్బతిన్న రోజు నుంచి మరమ్మత్తులు చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలంటూ సిపిఎం పలు మార్లు జిల్లా అధికారులను కలిసి వినతిపత్రం అందజేసిందన్నారు. ఓ జాతీయ రహదారి దెబ్బతిని 20 రోజులు పూర్తి కావస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందన్నారు. సిపిఎం కోవూరు సిపిఎం నాయకులు షేక్ చాన్ భాషా మాట్లాడుతూ చిన్నపాటి గుంతను పూడ్చేందుకు ప్రభుత్వం చేయని పాలకులు , ప్రజా సమస్యలు పరిష్కారానికి ఏ మాత్రం కృషి చేస్తారని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి పై ఓవర్ బ్రిడ్జి పై ఏర్పడిన గుంతను పూడ్చేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు మూలం ప్రసాద్, కత్తి పద్మపి. వేణు శాఖ కార్యదర్శులు జాఫర్, నక్క వెంకటేశ్వర్లు,ఎం. శ్రీనివాసులు, ఎం. అశోక్,కోవూరు మండల నాయకులు బుజ్జయ్య, వెంకట సుబ్బయ్య, మోహన్, కాలేషా, నజీర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఓ ఆనంద్

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి చర్యలు

నెల్లూరు : పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఒ. ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్లో 2024-25 సంవత్సరానికి జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ప్రణాళిక పై సమావేశం నిర్వహించారు. జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి విజయ్ వినీల్ కుమార్ స్కిల్ డెవలప్మెంట్ ప్రణాళిక ఉద్దేశ్యాలను వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా నిరుద్యోగులు, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొం దించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ిఆర్డిఏ పి డి సాంబశివరెడ్డి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వెంకటయ్య, ఎపిఎంఐపి పీడీ రవీంద్ర ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు సరికాదు

ప్రజాశక్తి-నెల్లూరు :గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను అక్రమంగా తొలగించడం దారుణమని, ఈ చర్యలను తక్షణమే నిలిపివేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ ఎదుట అక్రమ తొలగింపులను నిరసిస్తూ ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కలెక్టర్‌ను కలిసి ఫీల్డ్ అసిస్టెంట్లు రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎదు ర్కొంటున్న సమస్యలను విన్నవించారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించే అధికారం ఎవరికి లేదని, ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు టి ప్రసాద్ మాట్లాడుతూ అధికార పార్టీ రాజకీయ నాయకుల ఆజ్ఞలతో ఫీల్డ్ అసిస్టెంట్లను తొల గిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. బలవంతంగా ఫీల్డ్ అసిస్టెంట్లను రాజీనామా చేయాలని ఒత్తిడి

చేస్తున్న అధికార పార్టీ నాయకుల పై, అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు ఇరగాలయ్య, ఖాదర్బాషా మాటాల్లఆరు. అక్రమ తొలగింపులను అరికట్టని అరికట్టని పక్షంలో ఆగసు2న చలో విజయవాడ కార్యక్ర మాన్ని నిర్వహించి ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా నాయకులు రమేష్ ,మస్తాన్ రెడ్డి, కిషోర్, శీను, గురవయ్య, వెంకటరమణ, జగదీష్, ఏడుకొండలు పాల్గొన్నారు.

పలుచోట్ల విద్యార్థులకు భోజనాలు

ప్రజాశక్తి - లింగసముద్రం :శిక్షసప్తాహ్ కార్యక్రమం ముగింపు సందర్భంగా మండల కేంద్రమైన లింగసముద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నందు సోమవారం శుభ్- భోజన్ కార్యక్రమం జరిగింది. పాఠశాల విద్యార్థులకు మండల తెలుగు యువత అధ్యక్షుల ఎఅడపా రంగయ్య పిల్లలకు భోజనం అందిం చారు. ఇన్చార్జి తహశీల్దార్ టి.ప్రసాద్ మండల పరిషత్ అభివద్ధి అధికారి కట్టా శ్రీనివాసులు, మండల విద్యాశాఖ అధికారి విద్యార్థులకు భోజనం వడ్డించారు. పాఠశాల ప్ర ధా నో పా ధ్యా య ఎ లు మల్లెబోయిన సుధాకర్ రావు, మాజీ ఎంపీపీ పూరిమిట్ల బాలకోటయ్య, లింగసముద్రం గ్రామ టిడిపి అధ్యక్షులు గాలంకి ప్రసాద్, టిడిపి నేతలు పూరిమిట్ల గురునాథం, సహ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దాత మండల తెలుగు యువత అధ్యక్షులు అడపా రంగయ్యను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శాలువా కప్పి సన్మానించారు.

లింగసముద్రంలో..

వలేటివారిపాలెం : బలవర్ధకమైన ఆహారంతోనే విద్యార్థుల ఆరోగ్యం సాధ్యమవుతుందని కొండసముద్రం గ్రామ టిడిపి అధ్యక్షులు ఘట్టమనేని సుబ్బారావు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యా విధానాన్ని కేంద్రం ఆమోదించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం మండలంలోని కొండసముద్రంలో గ్రామ టిడిపి యువ నాయకులు ఘట్టమనేని మాధవరావు సూచనలతో పాఠశాల విద్యార్థులకు పోషకాహారాన్ని పంపిణీ చేశారు. టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు సుబ్బారావు, టిడిపి నాయకులు నల్లమోతు రాంబాబు ఉన్నారు.

తోటపల్లిగూడూరు :గ్రామస్తులను పాఠశాలలకు దగ్గర చే యడమే శిక్ష సప్త హ్ కార్యక్రమం ము ఖ్య ఉద్దేశ్యమని విద్యాశాఖ అధికా రి సన్నపురెడ్డి వేణుగోపాల్ రెడ్డి పేర్కొ న్నారు. సోమవా రంతో తోటపల్లిగూడూరు మండలంలోని ప్రభుత్వ పా ఠ శాలల్లో నిర్వహిస్తున్న శిక్ష సప్తహ్ (కార్యక్ర మాలు ముగి శాయి. సౌత్ ఆములూరు ప్రాథమి కోన్నత పాఠశాలలో హెచ్‌ఎం షేక్ అ హ్మద్ బాషా ఆధ్వర్యంలో, కొత్తపా లెం స్కూల్లో ప్రధా నోపాధ్యాయులు శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో శిక్ష సప్తహ్ కార్యక్రమాలు జరిగాయి. ఎంఇఒ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కందుకూరు : పట్టణంలోని ఇస్కాలవారి స్ట్రీట్ లోని అభ్యుదయ పాఠశాలలో శుభ్ దిన్ భోజనం కార్యక్రమం సోమవారం జరిగినది, ఇందులో ముఖ్య అతిథులుగా ఎస్.సురేష్ రెడ్డి,ఎంఇఒ సుబ్బారెడ్డి పాల్గొ న్నారు. సురేష్ రెడ్డి ని ఎంఇఒ సుబ్బారెడ్డిని సత్కరించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు అర్ వేదవతి మాట్లాడారు. సిఆర్‌పి కిరణ్ ఉన్నారు

జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 22వ తేదీ నుంచి వారం రోజులు పాటు జరుగుతూ నేటితో ముగుస్తున్న శిక్ష సప్తహు కార్యక్రమానికి ఎనిమిది వేల రూపాయలు ఆర్యవైశ్య నాయకుడు ,పట్టణ టిడిపి కోశాధికారి కొత్తూరి సుధాకర్ రావు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి , ఉపాధ్యాయు విప్రనారాయణ మాట్లాడారు. సుధాకర్ రావును ఘనంగా సన్మానించారు.

దాత సుధాకర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

. **ప్రజాశక్తి-నెల్లూరు :**కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక లో శుభ్ దిన్ భోజన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు ఎం భాస్కర్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. ప్రధానో పాధ్యా యుడు తన స్వంత నిధులతో స్నాక్స్ అందజేయడం జరిగింది

నెల్లూరులోని కొండాపాలెంలో..

'కులం పేరుతో రెచ్చగొడుతున్న వైసిపి'

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వైసిసి కూటమి నేతల నుంచి దాడులను ఆశిస్తోంది. కులం పేరిట ట్రాప్ చేసేందుకు, విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తుందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రజల్లో చర్చ రాకుండా వైసీపీ నేతలు చౌకబారు విమర్శలకు దిగుతున్నారన్నారు. 2019 ఎన్నికల ఫలితాలు "దేవుడి స్క్రిప్ట్" అయితే 2024 ఎన్నికల ఫలితాలు జగన్‌కు "దేవుడు వేసిన శిక్ష".అని అన్నారు. శాంతిభద్రతల గురించి జగన్ వ్యాఖ్యలు వింటుంటే ఆయన మానసికస్థితి పై అనుమానం కలుగుతోందని ఎద్దేవా చేశారు. రాద్ధాంతం చేయడం తప్ప సిద్ధాంతం ఎరుగని పార్టీ వైసిపి అని న్నారు. జగన్ నాయకత్వాన్ని రాయలసీమ ప్రజలే తిరస్కరించారని, 2 సీట్లలో స్వల్ప తప్పిదాలను టిడిపి సరి చేసుకుని ఉంటే కడపలో గెలిచేది జగన్ ఒక్కరేఅన్నారు. ఏ ఆర్థిక నిపుణుడు లెక్కలు తేల్చలేనంత ఆర్థిక దోపిడీ వైసీపీ ప్రభుత్వంలో జరిగిందని, . ముఖ్యమంత్రి మొదలుకుని మంత్రులు, సాధారణ నేతల వరకు లక్షల కోట్లను దోచేశారని విమర్శించారు. 2019 ఎన్నికల గెలుపును దేవుడి స్క్రిప్ట్ అని గొప్పగా చెప్పుకున్న జగన్మోహన్ రెడ్డి...ఐదేళ్ల దుర్మార్గ పాలనను చూసి ప్రజలు ఇచ్చిన తీర్పును దేవుడు వేసిన శిక్ష గా ఎందుకు ఒప్పుకోలేకపోతున్నావన్నారు. 57 శాతం ఓట్లు, 93 శాతం సీట్లు సాధించిన ప్రభుత్వాన్ని నెల రోజులు గడవక ముందే రద్దు చేయాలని కోరిన ఘనుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు. జగన్ అధ్వాన పాలన కారణంగా, నేడు కూటమి పాలన మొదలై 50 రోజులు గడుస్తున్నా ఏ శాఖ లో ఎంత అప్పులు తెచ్చారో, ఏ శాఖ ఆస్తులు ఎవరికి రాసిచ్చారో, ఏమేమి కుదువ పెట్టారో కొలిక్కిరాని పరిస్థితి నెలకొందన్నారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దమనకాండ, వ్యవస్థల నిర్వీర్యం భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ జరగలేదన్నారు. రాక్షస పాలన, శాంతి భద్రతలు, వ్యవస్థల విఫలం గురించి ఢిల్లీ లో జగన్మోహన్ రెడ్డి మాట్లాడటం ఆశ్చర్యం కలిగించిందన్నారు. మద్యం, గంజాయి, సారాయి, రాళ్ళు, డ్రగ్స్, గ్రావెల్, ఇసుక వంటి వ్యాపారాల నిర్వహణ ను వైసీపీ ప్రభుత్వ హయాంలో స్వయంగా ముఖ్యమంత్రి కుటుంబమే చేపట్టిందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పి.రూప్‌కుమార్‌యాదవ్, నాయకులు ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, తిరుమల నాయుడు, సాబీర్, అమ్ములా పాల్గొన్నారు

మీడియాతో మట్లాడుతోన్న బీద రవిచంద్ర

వీధిలైట్లు వెలగడం లేదు...

ప్రజాశక్తి-కందుకూరు :

మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాధుల,డయల్ యువర్ కమిషనరు కార్యక్రమము ద్వారా ఏడు అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనరు కె.వి కష్ణారెడ్డి తెలిపారు. మున్సిపాలిటి పరిదిలోని అనదపురం గ్రామంలో వీధి లైట్లు వెలగడం లేదని డిటిపి నాయ కుడు తలపనేని రవి బాబు ఫిర్యాదు చేశారు. అందరు సెక్షన్ హెడ్స్ పాల్గొన్నారు.ప్రతి సోమవారం కందుకూరు పురపాలక సంఘ కార్యాల యము కమీషనర్ వారి ఛాంబర్‌లో జరిగే ప్రజా పిర్యాధుల కార్యక్రమాని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.వి కష్ణారెడ్డి పేర్కొన్నారు. 9177700267 నెంబర్‌కు సమస్యలను తెలియజేయచ్చున్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

నెల్లూరు : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిస్తుందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించి పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రజల నుంచి వచ్చిన సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరి ంచేందుకు అధికారులు దష్టి సారించాలన్నారు డిఆర్‌ఒ లవన్న, జడ్పీ సీఈవో కన్నమ నాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. సాంబశివారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, డిటిసి చందర్, ఐసిడి ఎస్ పిడి హేనా సుజన్, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, హౌసింగ్ పీడీ దయాకర్, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, ఇరిగేషన్ ఎస్‌ఈ కష్ణమోహన్, డీఎస్‌ఓ వెంకట రమణ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పరిమళ పాల్గొన్నారు.స్థానిక ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాలుఏలో సోమవారం నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో 110 ఫిర్యాదులు స్వీకరించామని ఎస్‌పి జి.కృష్ణకాంత్ తెలిపారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

'ప్రకాశం'లో రక్తదానం

ప్రజాశక్తి-కందుకూరు : ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మరోసారి రక్తదానంతో ప్రాణదాతలుగా నిలిచారని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య పేర్కొన్నారు. కావలి, కందుకూరు ఏరియా వైద్యశాలల ఆధ్వర్యంలో సోమవారం క్యాంప్ జరిగింది. ప్రకాశం ఎన్‌సిసి, ఎన్ఎస్‌ఎస్‌లు నేతృత్వం వహించారని ఆయన చెప్పారు. మొత్తం 40 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 35 మంది రక్తదానం చేశారని ఎన్‌సిసిఆఫీసరు ఏడుకొండలు వెల్లడించారు. కరస్పాండెంట్ రామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ జిల్లా వైద్యశాలు, రెడ్ క్రాస్, పోలీసుల అమర దినోత్సవ సందర్భంగా తమ విద్యార్థులు వందల సంఖ్యలో రక్తదానం చేస్తుంటారన్నారు. ఒక వ్యక్తి రక్తదానంతో మరో వ్యక్తికి ప్రాణదాత అవుతారని, విద్యార్థి జీవితంలో ఇదో సార్థకతగా భావించాలన్నారు. భవిష్యత్ లో కాలేజీ నిర్వహించే శిబిరంలో వంద మంది కనీసం రక్తదానం చేసేలా ఎన్‌సిసి,ఎన్ఎస్ఎస్ నిర్వాహకులు ప్రోత్సహించాలని రామయ్య ఉద్బోధిం చారు. గతంలో కాలేజీలో నిర్వహించే రక్తదాన శిబిరాలలో ఎక్కువ మంది విద్యార్థుల బ్లడ్ గ్రూప్ లను రికార్డ్ చేసి, స్థానిక వైద్యశాలల్లో పేషంట్లకు మొత్తం అవసరమైనప్పుడు విద్యార్థుల ఆసక్తి మేరకు రోగులకు రక్తదానం చేయించే కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు. ప్రిన్సిపాల్ డా ఎఎ రవికుమార్, ఫస్ట్ ఇయర్ ఓవరాల్ ఇన్చార్జి జి. ప్రసాద్, ప్రభుత్వ వైద్యశాలలకు చెందిన డాక్టర్ ఎం. డి. షావుద్దీన్ (మెడికల్ ఆఫీసరు)డాక్టర్ వెంకటరెడ్డి (సివిల్ సర్జన్ కందుకూరు) డా ఎఎ విజయవాణి (మెడికల్ ఆఫీసరు) లాబ్ టెక్నీషియన్లు ఎస్ రామారావు, ఐ. రాజ శేఖర్ పాల్గొన్నారు. రక్తదాతలైన విద్యార్థులకు డ్రింక్, బిస్కెట్లు వైద్యులు పంపిణీ చేశారు. వారికి ప్రశంసాపత్రాలను రామయ్య అందజేసారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కంచర్ల రామయ్య

టిడిపిలోకి సర్పంచ్ శివపార్వతి

ఎంఎల్ఎ 'ఇంటూరి' సమక్షంలో చేరిక

ప్రజాశక్తి-కందుకూరు :గుడ్లూరు మండలం, చినలాటరిపి సర్పంచ్ మొగిలి శివపార్వతి సోమవారం టిడిపిలో చేరారు. కందుకూరు టిడిపి కార్యాలయంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పసుపు కండువా కప్పుకున్నారు. ఆమెతోపాటు భర్త మొగిలి లక్ష్మీనారాయణ, ఉప్పలపల్లి యలమందారెడ్డి కూడా పార్టీలో చేరారు. పంచాయతీలోని పెదలాటరిపి గ్రామానికి చెందిన శివపార్వతి గత ఎన్నికల్లో వైసిపి మద్దతుతో సర్పంచ్ గా గెలిచారు. మొదటి నుంచి వైసిపిలో క్రియాశీలకంగా కొనసాగుతున్నారు. వీరికి ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పార్టీలోకి సాదర స్వాగతం పలికారు. గ్రామాభివద్ధికి సంబంధించి ఏ విషయమైనా తన దష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ఎంఎల్ఎ హామీనిచ్చారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు చిట్టేల యానాదయ్య, పార్టీ నాయకులు ముప్పా మల్లికార్జున, శోభన్ బాబు, చిట్టేల వెంకటకష్ణ, మూలే వెంకటేశ్వర్లు, ఎల్లంకి సుబ్బరాములు, కష్ణ, పొన్నగంటి శ్రీనివాసులు, మాధవ, వెంకటరమణ, కొండయ్య, గుండ్లపల్లి శివ, రవి, సుబ్బారావు, వేణుగోపాల్, కామయ్య, అంకమరావు, రాఘవులు ఉన్నారు.

ఎంఎల్ఎ సమక్షంలో టిడిపిలో చేరిన సర్పంచ్ శివపార్వతి

బిసి 'ఇ' సర్టిఫికెట్లు మంజూరు చేయాలి : ఆవాజ్

ప్రజాశక్తి-నెల్లూరు : మైనారిటీల్లో మహమ్మద్‌లుగా ఇంటి పేరు ఉన్న వారందని బిసి'ఇ'లుగా గుర్తించి వారికి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని ఆవాజ్ జిల్లా కమిటీ కోరింది. సోమవారం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఓ ఆనంద్‌ను కలిసి ఆవాజ్ జిల్లా కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. మహమ్మద్‌లకు బిసి'ఇ' ధ్రువీకరణ పత్రాలను మండలాల్లో ఇవ్వడం లేదన్నారు. స్కూళ్లల్లో మహమ్మద్ అని ఉంటే ఓసి అని రాస్తున్నారని తెలిపారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమస్యను పరిష్కారం చేస్తామని హామినిచ్చారు. ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ నజీర్ భాష,సర్దార్ అహమ్మద్ భాదితులు ఇషాక్, రహమాన్ ఉన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆవాజ్ నాయకులు

విరాళం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలో అయ్యప్ప స్వామి ఆలయం వెనక నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి అన్న ప్రసాద వితరణ భవనానికి కందుకూరు గ్రామ వాస్తవ్యులు డిప్యూటీ తహశీల్దార్ కాటా చెంచు రామయ్య భార్య చిన్నమ్మాయి వెంకట అనుదీప్, పూర్ణ అవినాష్ రూ 1,00,116లు విరాళాన్ని అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులకు అందజేశారు. అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు నలబోతుల మురళి,వున్నం వీరాస్వామి, ఇస్కాల వెంకట నరసింహం,కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు ఉన్నారు.

బెట్టింగ్ రాయుళ్లపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు :నగరంలో సింగల్ నెంబర్ లాటరీలు, బెట్టింగ్ యాప్‌లు, చోరీలు నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇన్సాఫ్ నాయకులు ఎస్‌పి జి.కృష్ణకాంత్‌కు వినతిపత్రం అందజేశారు.సిపిఐ నాయకులు గౌస్, లతీఫ్ అహ్మద్, రియాజ్, షాకీర్, బాబు తదితరులు పాల్గొన్నారు

దళిత సంక్షేమ పథకాల పునరుద్ధరణ సంతోషం

ప్రజాశక్తి-నెల్లూరు :వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామి ప్రకటించడం అభినందనీయమని జిల్లా ఎస్సీ ఎస్టీ ప్రొటెక్ట్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు శేషం సుదర్శన్ అన్నారు. సోమవారం ఈ మేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు.

సబ్ స్టేషన్‌లో సాంకేతిక లోపం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు పంచాయతీ చెంచులక్ష్మీపురంలో గ్రామంలో ఉన్న విద్య సబ్ స్టేషన్‌లో సాంకేతిక లోపంతో విద్యుత్ అంతరాయం జరుగుతుందని బోగోలు మండల విద్యుత్ శాఖ అధికారి ఎస్‌కె.నాగూర్‌వల్లీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కొన్ని రోజుల నుండి ఈదురు గాలులు వీస్తుండడంతో విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఉన్న త్రీఫేస్ లైన్లు డైరెక్ట్ అయ్యి సిటీ లైన్లు ఫెయిల్యూర్ అయ్యి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని, సిటీ లైన్ల ప్రస్తుతానికి డైరెక్ట్ చేసి ఉన్నాయని తెలిపారు. మంగళవారానికి కొత్తసిటీ లైన్లు ఏర్పాటు చేసి రైతులకు, వ్యాపారస్తులకు, ప్రజలకు ఎటువంటి విద్యుత్ అంతరాయం ఉండదని తెలిపారు. మండలంలో వేరుశనగ కోత దిశలో ఉందని, పంట కోత అనంతరం రైతులకున్న విద్యుత్ సమస్యలను పూర్తి చేస్తామని తెలిపారు. బోగోలు పంచాయతీ కుమ్మరివీధి, తాళ్లూరు గ్రామాల్లో ఉన్న విద్యుత్ సమస్యలు ఉండడంతో గ్రామస్తులు కావలి శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి తెలపడంతో వెంటనే స్పందించి తాళ్లూరు గ్రామానికి ట్రాన్స్ ఫారం, కుమ్మరి వీధికి త్రీఫేస్ లైన్‌ను బిగించామని తెలిపారు. ఆదివారం రైతులు సబ్ స్టేషన్ వద్ద ధర్నా కార్యక్రమం చేశారని వారికి సమస్యను త్వరలో పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-ఉదయగిరి : పూసల కాలనీలో ప్రజలకు టైఫాయిడ్, కామెర్లు, డయేరియా, మలేరియా డెంగీ వ్యాధుల నివారణపై గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విద్యాధికారి కలసపాటి.వెంకటసుబ్బయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యాపిస్తున్న సీజనల్ వ్యాధులకు కాచి చల్లార్చిన నీటిని తాగాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమల భారి నుండి రక్షించడానికి దోమతెరలు వాడాలన్నారు. ముఖ్యంగా టైఫాయిడ్ కామెర్లు వైరల్ ఫీవర్స్ నీరు కలుషితం వల్ల వ్యాపిస్తాయని ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. వైద్యశిబిరం నిర్వహించి ఎఎన్ఎం ఎంఎల్‌హెచ్‌పిలతో చిరువ్యాధులకు చికిత్స నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సబ్ యూనిట్ అధికారి దోమల నివారణ చర్యల భాగంగా ప్రతి ఇంటికి ఇండోర్ స్పేస్ స్ప్రేయింగ్ చేసి నిల్వ ఉన్న నీటిలో అబోట్ స్ప్రేయింగ్ చేయించి సచివాలయ వైద్య సిబ్బంది పరీక్షించడం జరుగుతుందన్నారు. ఈ శానిటైజేషన్ కార్యక్రమాన్ని స్థానిక పంచాయతీ కార్యదర్శి కరీముల్లా పర్యవేక్షించారు. కార్యక్రమంలో టివి సూపర్‌వైజర్ బి.వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పి రామారావు, ఎఎన్ఎం నూర్జహాన్, ఆరోగ్య సహాయకులు రబ్బానీ భాషా, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు బిట్-2 పరిధిలోని బేతానిపేట గ్రామంలో సోమవారం లెప్రసీ, ఎయిడ్స్, టివి వ్యాధుల నివారణపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఖాదర్ వల్లీ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు లెప్రసీ, టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించి వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని, భద్రపేట గ్రామంలో ఇంటింటికి సర్వే నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోవూరుపల్లి ప్రాథమిక వైద్యశాల హెచ్ఇ అనూష, ఎఎన్ఎంలు ఎం.మంగమ్మ, ఎం.రత్నకుమారి, ఆశా వర్కర్లు, ఎ.అలేఖ్య, శివ కామేశ్వరీ, పి.లలిత, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు, కోవూరుపల్లి ప్రాథమిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటరెడ్డికి సన్మానం

వెంకటరెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : శ్రీ కళావేదిక ఏలూరి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొని కవుల సీసపద్య వైభవం పుస్తకావిష్కరణ సందర్భంగా స్వర్ణకంకణ, కిరీటి ధారతో గౌరవం పొందిన తెలుగుభారతి సేవా సమితి ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి పెద వెంకటరెడ్డిని సోమవారం తెలుగు భారతి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన శ్రీ కళావేదిక వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొని కవుల సీసపద్య వైభవం పుస్తకావిష్కరణలో పాల్గొనడం చాలా అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో తెలుగు భారతి సేవాసమితి అధ్యక్షులు సోమవరపు సుబ్బరాయుడు, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కంచి పరమేశ్వర రెడ్డి, గౌరవాధ్యక్షులు గోవింద రెడ్డి, సహాధ్యక్షులు కొల్లా వెంకటేశ్వర్లు, తెలుగు భారతి సేవాసమితి ప్రతినిధులు ఎస్‌వి చలమయ్య, రమణయ్య, యానాదిరెడ్డి, నారాయణ రావు, ఆర్థిక కార్యదర్శి ఒమ్మిన సుబ్రమణ్యం, రామిరెడ్డి, సుబ్బయ్య, శ్రీనివాస రాజు, రామమోహన్ రెడ్డి, సురేష్, అపర్ణ, ఎపిజిబి మేనేజర్ హరిక్రిష్ణ, కె.రవీంద్రకుమార్, ఉపాధ్యాయులు హరికృష్ణ, వెంకయ్య, రమేష్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

సాధనతోనే విజయం

ప్రజాశక్తి-కావలి : సాధనతోనే విజయం సాధ్యమవుతుందని డి.బి.ఎస్. ఇంగినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాల కరస్పాడెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు పేర్కొన్నారు. 27, 28 తేదీలలో కడప జిల్లా వేంపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీలలో డి.బి.ఎస్. పాలిటెక్నిక్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థిని కొండూరి మల్లేశ్వరీ విజయం సాధించి తదుపరి జైపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు, భూటాన్‌లో జరిగే అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై కళాశాల కరస్పాడెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి వి రావు మాటాడుతూ భారతదేశ కీర్తిప్రతిష్ఠలను చాటిచేప్పే క్రీడాకారులను ప్రోత్సాహించడం ప్రతీ విద్యసంస్థ భాధ్యతగా భావించాలని సూచించారు. కార్యకమంలో కళాశాల పరిపాలన అధికారి జి.రమేష్ బాబు, అధ్యాపకులు దామోదరరెడ్డి, పి.డి.శివ సాగర్, విద్యార్థిని తండ్రి, ఇతరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి : నెల్లూరు పట్టణం నివాసులు, సంయుక్త సేవాసంస్థ సభ్యులైన కె.శ్రీనివాసరావు– ఎన్.సి. లలిత దంపతులు వారి కుమారుడైన జైసాయిరాం భావన్ జ్ఞాపకార్థంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా బుడంగుంట నక్కలోళ్ళ కాలనీలోని పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ నేటి దాతలు శ్రీనివాసరావు – లలిత దంపతులకు వారి కుమారుడు జైసాయి రాం భావన్ వారికి దూరమైన 29వ తేదీన ప్రతినెలా ఎక్కడో చోటపేదలకు సేవలు అందించడం ఆదర్శనీయమని తెలిపారు. అందరూ సంవత్సరంలో వారికి దూరమైన రోజున ఏదోక కార్యక్రమాలు చేస్తుంటే వీరు మాత్రం వారికి దూరమైన 29వ తేదీన ప్రతినెలా పేదలకు సేవలందించడం వారి బిడ్డ మీద వారికున్న ప్రేమకు నిదర్శమని తెలిపారు. ఇటువంటి ఆదర్శ దంపతులను మరికొందరు ఆదర్శంగా తీసుకొని మీ పరిసర ప్రాంతాల్లోని పేదలకు ఏదో ఒక రూపంలో సాయం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు సంయుక్త సంస్థ ద్వారా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

వరిపంట పరిశీలన

ప్రజాశక్తి-కలిగిరి : మండల కేంద్రమైన కలిగిరి మండలంలోని జిర్రవారిపాలెం సాగు చేసిన కెఎన్ఎం 1638 రకం వరి పైరును వ్యవసాయ అధికారులు ఎ.డి.ఎ. రామిరెడ్డి, సురేష్ బాబు, సుజాత పరిశీలించారు. వరి పైరుకు నల్లి తెగుళ్ల సోకకుండా ఉండేందుకు ఎకరాకు 400 ఎంఎల్ ప్రొఫెనోపాస్, లేదా 200 ఎంఎల్ ఒబెరాన్ మందులు పిచికారి చేయాలని సూచనలు తెలియజేశారు.

విజేతలకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి-కావలి : పులవర్తి రాఘవనాయుడు, వెంకటసుబ్బమ్మల జ్ఞాపకార్థం పులివర్తి బ్రదర్స్ కావలి పట్టణ స్థాయిలో నిర్వహించిన టెన్నిస్ టోర్నమెంట్, సోమవారం ఘనంగా ముగిసిన పోటీల్లో విజేతలకు బహుమతులు అంజేశారు. ఈ పోటీలలో 16 టీములు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్‌లో విన్నర్స్‌గా శ్రీకాంత్ రెడ్డి, వివి కృష్ణప్రసాద్, కాగా సిహెచ్ మణికంత, డాక్టర్ పి.ప్రసాద్‌రెడ్డి కైవసం చేసుకున్నారు. తృతీయ స్థానంలో డాక్టర్ ఎ.ప్రవీణ్ కుమార్, సిహెచ్.రాంబాబు నిలిచారు. విన్నర్స్‌కు రూ.2వేల నగదు, కప్పు బహూకరించారు. రన్నర్స్‌కు రూ.1000 నగదు కపులను ప్రదానం చేశారు. విశ్వోదయ రెక్టర్, వెటరన్ టెన్నిస్ ప్లేయర్ డి.వినయ్‌కుమార్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంతో సమకూర్చి ఈ పోటీలను ఘనంగా నిర్వహించిన ఈ సందర్భంగా ఎంతో శ్రమ కోర్చి, ఈ పోటీలను ఘనంగా నిర్వహించిన పులివర్తి బ్రదర్స్ రవీంద్రరావు పులివర్తి, భాస్కరరావు పులివర్తి, రాజశేఖర్ రావు పులివర్తి, శ్రీనివాసులు, క్రీడాకారులు అభినందించారు. టోర్నమెంట్‌కు సహకరించిన కమిటీ సభ్యులు ఎ.రామకృష్ణ, పి వి వంశీమోహన్, టి వి రమణ, మణికంతను పులివర్తి బ్రదర్స్ సత్కరించారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి పలు గ్రామాలకు చెందిన రైతులు 590 పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాగా వీటిలో 547పొగాకు బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 18పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. వీటిలో ఎన్‌బి 07, ఆర్ ఆర్ 02, సిఆర్ 08బి ఆర్ 01ఉన్నాయని తెలిపారు. అధిక బరువుతో ఉన్న 25పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.358 కాగా కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.281.50 నమోదు కాగా, వేలంలో 17మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొన్నారన్నారు.

స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

మాట్లాడుతున్న పసుపులేటి పెంచలయ్య

ప్రజాశక్తి-కావలి

రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కావలి రైల్వే స్టేషన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం స్టేషన్ సూపరింటెండెంట్ ఆశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు గౌరవాధ్యక్షులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ప్రతి నెలా కార్మికులకు వేతనాలు అమలు చేయడం లేదని కాంట్రాక్ట్ పద్ధతిలో కార్మికులను పెట్టుకొని తక్కువ జీతాలతో ఎక్కువ పనులు చేయిస్తున్నారన్నారు. కావలి రైల్వే స్టేషన్‌లో కాంట్రాక్ట్ కార్మికులకు కాంట్రాక్టర్, పిఎఫ్, ఇ.ఎస్.ఐ. కటింగ్ పోను నెలసరి రూ.14,820 ప్రతి కార్మికుడికి బ్యాంకులో జమ చేయాల్సి ఉన్నప్పటికీ ఇక్కడ పనులు చేయించే కాంట్రాక్టర్ రోజుకు రూ.250 చొప్పున నెలకు రూ.7500 కార్మికుల చేతికిచ్చి చేతులు దులుపుకుంటున్నాడని ఇది చాలా అన్యాయమన్నారు. ఇక్కడ కాంట్రాక్టర్ కార్మికుల జీతాలలో ఇంత దోపిడీ చేస్తున్నప్పటికీ రైల్వే అధికారులు పట్టీపట్టనట్లు ఉన్నారన్నారు. ఇదిచాలా విచారకరం అని కాంట్రాక్టర్ కార్మికుల పేరుతో ప్రతినెల పిఎఫ్ జమ చేయాల్సి ఉండగా, పిఎఫ్ స్లిప్పులను ప్రతినెలా కార్మికులకు అందజేయాల్సి ఉందన్నారు. అంతేకాకుండా ఇ.ఎస్.ఐ. కార్డులు, ఐడీ కార్డులు ఇయ్యాల్సి ఉన్నప్పటికీ ఇవ్వలేదన్నారు. యూనిఫారం కూడా సక్రమంగా ఇవ్వడం లేదని, ఇలా తక్కువ జీతాలు ఇచ్చి, శ్రమ దోపిడీ చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రతి కార్మికుడికి రూ.14800 బ్యాంక్‌ఖాతాలో జమ చేయాలని, ప్రతి నెలా పిఎఫ్ కార్మికుల పేరుతో జమ చేయాలని, ప్రతినెలా పిఎఫ్ స్లిప్పులను కార్మికులకు అందజేయాలని కోరారు. అంతేకాకుండా గతంలో ఈ స్టేషన్‌లో 12మంది కార్మికులు పనిచేసేవారని, ఇప్పుడు స్టేషన్ బిల్డింగులు, స్టేషన్ ఆవరణం, పెరిగినప్పటికీ ఆరుగురు కార్మికులతో పని చేయిస్తున్నారని, శ్రమ దోపిడీ చేస్తున్నారని ఇది చాలా దారుణమైన విషయమని, ఉన్నత అధికారులు ఇప్పటికైనా తక్కువ జీతాలు ఇస్తూ, కార్మికులను ఇబ్బందులు పెడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తగినంత మంది కార్మికులను నియమించాలని, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై.కృష్ణమోహన్, జి.మధుసూదనరావు, పి.తిరుపాలు, కార్మికులు పాల్గొన్నారు.

రైల్వే యార్డులో సమస్యలు పరిష్కరించాలి

నిరసన చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని పడుగుపాడు రైల్వే యార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ది రైల్వే వేగన్ లోడింగ్ అండ్ అన్‌లోడింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో పడుగుపాడు రైల్వే స్టేషన్ వద్ద ధర్నా చేసి అనంతరం ఎస్ఎస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు నెల్లూరు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ పడుగుపాడు రైల్వే యార్డు లోడింగ్ అండ్ అన్ లోడింగ్ ముఠావర్కర్స్‌గా 150మంది పని చేస్తున్నారని తెలిపారు. కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని యార్డులో పడమర వైపు రోడ్లు గుంతలు ఎండాకాలం దుమ్ము ధూళి, వర్షాకాలం బురదమయంగా ఉందని, రోడ్లకు మరమ్మతులు చేయాలని, రైల్వే బోగీలను స్తంభాలకు అడ్డం లేకుండా నిలపాలని, కార్మికులు విశ్రాంతి తీసుకునేందుకు గదిని ఏర్పాటు చేయాలని, యార్డులో తాగునీటి సౌకర్యం కల్పించాలని, స్కూటర్ల పార్కింగ్ ప్లేస్ కల్పించాలని డిమాండ్ చేశారు. మూలం ప్రసాద్, వేణు, వెంకటేశ్వర్లు, రత్నం, ది రైల్వే లోడింగ్, అన్‌లోడింగ్ వర్కర్లు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-కావలి : కావలి మండల న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో ముసునూరు బైపాస్ రోడ్డు కూడలిలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబర్, న్యాయవాది ఇసకల సాయిప్రసాద్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్ ఎం.మాలకొండారెడ్డి, బైక్‌రైడర్లు, టీచర్లు పాల్గొన్నారు.

డ్రైయిన్లలో పూడిక తీయించాలి


వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కోవూరు

బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో ప్రధాన కాలువైన పాత, కొత్త గుడిపల్లి కాలువలతో పాటు రేబాల కాలువలలో పూడిక తీయించాలని సిపిఎం నాయకులు సోమవారం నగర పంచాయతీ అధికారులను కోరారు. గుడిపల్లి కాలువల్లో సంవత్సరాలు తరబడి పూడిక తీయక పోవడంతోపై వరకు పూడిపోయి ఉన్నాయని, దానివల్ల మురుగునీరు ఎక్కడికక్కడ ఆగిపోయి పురుగులు, దోమలతో పాటుగా దుర్గంధం వెదజల్లుతోందని వారు తెలిపారు. ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాబోయేది వర్షాకాలం కావడం వల్ల ఈ మురికి, దోమలతో సీజనల్ వ్యాధులు లైన మలేరియా, టైఫాయిడ్, చికెన్ గునియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఈ ప్రాంతంలో సీజన్ వ్యాధులతో ప్రజలు తమ ప్రాణాలు తోపాటు, ఆర్థికంగా నష్టపోవడం జరిగిందని వారు తెలిపారు. అధికారులు సత్వరమే చర్యలు చేపట్టి ఈ కాలువల్లో పూడిక తోపాటు చెత్తాచెదారాలను, గడ్డిని తొలగించాలని వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పొతంశెట్టి శ్రీనివాసులు, షేక్.మునీర్ అహ్మద్, షేక్ జానీభాషా, మొల్తాటి శ్రీనివాసులు, షేక్.ఖాదర్‌బాషా, ఒంటేరు ప్రభాకర్, దత్తశ్రీ కోటయ్య, కొమ్మి శ్రీనివాసులు, పడవల సుబ్రహ్మణ్యం, చల్లకొలుసు మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను కాపాడాలని వినతి

నిరసన చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి-కావలి

మందాటి, కోవూరుపల్లి చెరువులను కాపాడాలని ప్రజలు అధికారులను కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక సందర్భంగా ఆర్‌డిఒ కార్యాలయం ముందు ముసునూరు రైతులు, దళితుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కనుమూరి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మందాటి చెరువు ప్రాంతంలో చుట్టుపక్కల ప్రజలు వచ్చి ఇష్టం వచ్చినట్లు ఆక్రమించుకొని చెరువు నామరూపాలు లేకుండా చేస్తున్నారన్నారు. ముసునూరు రైతులు కర్మంత్రాలు చేసుకొనే సర్వే నెంబర్ 75/2–ఎ. ను కూడా 12సెంట్లు ఆక్రమించారని ఇప్పటికి నిర్మాణాలు జరుగుతున్నాయని, ఆక్రమణలు, అమ్మకాలు, కత్తులతో పొడుచుకొని చావడాలు, మందాటి చెరువును యుద్ధ క్షేత్రంగా తయారు చేశారన్నారు. వారందరూ స్థానికేతరులు అని, అధికారులు కఠిన చర్యలు తీసుకోకుండా ఉంటే, దానిపై అన్ని కులాల వారితో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని తెలిపారు. దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ కోవూరుపల్లి, చెరువు వద్ద సాతుపాటి తిరుపాలుకు మూడున్నర ఎకరా 'డి'ఫారం పట్టాఇస్తే దానిని 30ఎకరాలు ఒక భూకబ్జాదారుడు ఒక రియల్ ఎస్టేట్ కంపెనీకి అమ్మివేశారని ఇది చాలా దారుణమన్నారు. లక్షల రూపాయిలు వైఎస్ఆర్ నాయకులు అందరికి పంచి పెట్టారని తెలిపారు. ఈ కబ్జాదారుల వల్ల చెరువుల్లో నీరు ఉండదని, రైతులు, రైతు కూలీలు నష్టపోతారని, ఇప్పటికి రాత్రివేళ గ్రావెల్ ఎత్తుతున్నారని తెలిపారు. నియోజకవర్గ నాయకులకు తెలియజేశామని, అయినా ఇప్పటికీ గ్రావెల్ ఎత్తుతున్నారని తెలిపారు. కాబట్టి పాపిరెడ్డి చెరువు, చుట్టుపక్కల గుంటలు, కాలువలు కోట్ల రూపాయిల విలువ చేసి భూములు కాపాడాలని తెలిపారు. ఎల్ఐసి రమణయ్య, దుగ్గిరాల జార్జి, బాబు, పెనుగొండ శ్రీనివాసులు, చెరుకూరి జనార్ధన్, పి.శ్రీనివాసులు, అనేకమంది పాల్గొన్నారు.

కావలి కాలువ ద్వారా నీరందించాలి

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-కావలి

కావలి కాలువ ద్వారా సోమశిల జలాల నుండి తాగు, సాగు నీరు ఇప్పించాలని జలదంకి మండల సి.పి.ఎం., రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు సోమవారం కావలి ఎం.ఎల్.ఎ. దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డిని ఆయన నివాసంలో కలిసి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో 5 సంవత్సరాల క్రితం టిడిపి ప్రభుత్వ హయాంలో కావలి కాలువ పూడిక తీయటం, రెండు వైపులా దిట్టం చేయడం జరిగిందన్నారు. ఫలితంగా 3 సంవత్సరాలపాటు కావలి కాలువ ద్వారా, సాగుదార్లకు నిరంతరాయంగా నీరు అందిందని తెలిపారు. గత 2 సంవత్సరాలుగా కావలి కాలువలోని గడ్డి దుక్కలు గానీ, జమ్ము గుబ్బలు గానీ, పూడికమట్టి గానీ తీయనే లేదన్నారు. అందువల్ల కాలువ గట్లు బలహీనపడి, కాలువ వెయ్యి క్యూసెక్కులు నీరు పారే సామర్థ్యమున్నా, కేవలం 500 క్యూసెక్కులు నీరు కూడా రావడం లేదన్నారు. ఎగువ కాలువ కట్టలు పొర్లుతున్నవన్నారు. అందువల్ల కావలి కాలువ కింద సాగుదార్లకు సరైన సమయంలో నీరందక, పంటలు వేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కావున జలదంకి మండల ప్రజానీకానికి, రైతులకు, వ్యవసాయ కార్మికులకు, జీవనాధారమైన కావలి కాలువ ద్వారా సోమశిల జలాలు 1000 క్యూసెక్కులు నీరు పారించే విధంగా కాలువ మరమ్మతులు సకాలంలో చేయించి, మండల సాగు రైతాంగాన్ని, వ్యవసాయ కార్మికులను కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో జలదంకి సిపిఎం కార్యదర్శి మేలింగి ఆంథోని, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు రావి మాల్యాద్రి, వ్యకాసం నాయకులు బి.నరసింహం తదితరులున్నారు.

అధికారులు గైర్హాజరు

ప్రజాశక్తి-ఉదయగిరి : ఎన్‌డిఎ కూటమి ప్రతిష్టాత్మకంగా సోమవారం చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు కరువుపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. అనేక సమస్యల పరిష్కారానికి నూతన ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వివిధ రకాల సమస్యలతో ప్రజలు తహశీల్దార్ కార్యాలయానికి వస్తున్నారని సంబంధిత అధికారులు డుమ్మా కొట్టడంతో చేసేదేమీ లేక వెనుదిరిగి వెళ్లారు. నూతన ప్రభుత్వంలోనైనా తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అనుకుంటే అధికారులు హాజరు కాకపోవడంపై వారు అసహనం వ్యక్తం చేసి ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు స్పందించి అన్ని శాఖల అధికారులు సోమవారం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వచ్చిన ప్రతి సమస్యకు వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తూ డుమ్మా కొడుతున్న అధికారులపై చర్యలు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి : ఉమెన్స్ ఫోర్స్

ప్రజాశక్తి-కావలి : కావలి తుఫాన్ నగర్‌కు చెందిన 4వ తరగతి చదువుతున్న 9యేళ్ల మైనర్ బాలికపై అఘాయిత్యం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు డిమాండ్ చేశారు. కాగా కావలి తుపాన్ నగర్‌కు చెందిన 9యేళ్ళ బాలికను అదే ప్రాంతంలోని 53యేళ్ల మృగాడు శనివారం మధ్యాహ్నం 12 గంటలకు, బాలిక ఒక్కటే ఇంట్లో ఉండటం కాపుకాసి గమనించి, తల్లిదండ్రులు పనులకు పోవడం, అనారోగ్యంతో పాప ఒక్కతే ఉండటం గమనించిన మృగాడు అమ్మాయి దుస్తులను విప్పించి, నగ్నంగా ఫొటోలు తీసి, ఘోరంగా అత్యాచారం చేసిన ఘటన ఆదివారం మధ్యాహ్నం వెలుగులోకి వచ్చిందన్నారు. కావలి ఏరియా ఆస్పత్రిలోని డాక్టర్లు ఆ పాపకు తక్షణమే చేయాల్సిన వైద్య పరీక్షలను ఆలస్యంగా ఈరోజు సాయంత్రానికి చేసి, ఇంటికి పంపగా, కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు ఏరియా ఆస్పత్రికి, తుపాన్ నగర్‌లోని బాధిత బాలిక ఇంటికి వెళ్లి మాట్లాడి ధైర్యం చెప్పి, రేపిస్ట్ మృగాడికి తక్షణ కఠిన శిక్ష పడేదాకా అండగా ఉంటామని చెప్పి, 2 టౌన్ పోలీసులకు కలిసి, ఫోక్సో కేసు ప్రకారం ఎఫ్.ఐ.ఆర్. కాపీని సి.ఐ. వద్ద తీసుకున్నారు. నిందితుడు ప్రస్తుతం 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కస్టడీలో ఉన్నాడు. నిందితుడిని త్వరితగతిన కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు పంపి ఫాస్ట్‌టాగ్ కోర్టు ద్వారా కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సి.శారద, టి.సుజాత, షేక్.ఫాతిమా, షేక్.నూర్జహాన్, తదితరులు కోరారు.

చట్ట ప్రకారం శిక్ష పడేలా చూస్తాం.. : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని తుపాన్ నగర్‌కు చెందిన చిన్నారిపై అఘాత్యానికి పాల్పడిన నిందితుడికి చట్ట ప్రకారం కఠినంగా శిక్ష పడేలా చూస్తామని కావలి ఎంఎల్ఎ దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం కావలి డిఎస్‌పి ఎం.వెంకట రమణ, రెండవ పట్టణ సిఐ కె.శ్రీనివాస రావులతో కలిసి ఎం.ఎల్.ఎ. కావ్య క్రిష్ణారెడ్డి సోమవారం బాలిక నివాసానికి చేరుకుని, బాలిక తల్లిదండ్రులను పరామర్శించారు. చిన్నారి తల్లిదండ్రులను, ఇళ్ల పరిసరాల ఫొటోలు తీస్తున్న వారిపై ఎంఎల్ఎ మండిపడ్డారు. వారికి న్యాయం చేయడానికి వచ్చామన్నారు. బాలికకు సత్వరం న్యాయం చేసి, అండగా ఉంటామన్నారు.

దూదేకుల మహిళా నాయకుల ఖండన

ప్రజాశక్తి-కావలి : తుపాన్ నగర్‌కు చెందిన 9సంవత్సరాల బాలికపై 53యేళ్ల నిందితుడు అఘాయిత్యానికి పాల్పడిన ఘటనపై దూదేకుల సంఘం నాయకులు సోమవారం తీవ్రంగా ఖండించారు. నిందితుడికి తగిన శిక్ష పడేంత వరకు పోరాడుతామని రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మస్తానమ్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్.సలీంలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్ సాహెబ్, పట్టణ అధ్యక్షులు ఖలీల్, చెన్నయ్య, రఫీ మహిళా విభాగం రాష్ట్ర సభ్యులు ఎస్‌కె దిల్షాద్, జిల్లా అధ్యక్షురాలు షాకిర కలిసి ధైర్యం చెప్పారు.

న్యాయం చేయండి సారూ..

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని ముస్తాపురం అలుగు సమీపంలోని లిటిల్ ఏంజెల్ పాఠశాలలో విద్యార్థిని స్టడీ గురించి ఆరా తీసిన విద్యార్థిని తండ్రి బుజ్జిరెడ్డిపై స్కూల్ కరస్పాండెంట్ యాజమాన్యం కలిసి చేసిన దాడి యత్నంలో తమకు న్యాయం చేయాలని బాధితుడి భార్య విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం ఆమె ఎస్‌పి కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎస్‌పి కృష్ణకాంత్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం బుజ్జిరెడ్డి భార్య మీడియాతో మాట్లాడుతూ తన భర్తను అన్యాయంగా స్కూల్ కరస్పాండెంట్ తీవ్రంగా కొట్టారని, తమకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని తెలిపారు. తమకు ఎక్కడా న్యాయం జరగడం లేదని, అందుకే ఎస్‌పి న్యాయం చేస్తారని ఆయనను కలిశామన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-కావలి

జగనన్న లేఅవుట్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని బిజెపి పట్టణ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం ఆర్‌డిఒకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు పరుసు వెంకటేశ్వర్లు, మంద కిరణ్‌కుమార్, కూరాకుల సవీంద్ర, సుందరిశెట్టి సుజి, దేవుండ్ల రాకేష్, గుడిపల్లి ప్రసన్నకుమార్ మేదరమెట్ల మణిదీప్, దాసరి లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-ఉదయగిరి

కొండాయపాలెం గ్రామంలో శానిటైజేషన్‌లో భాగంగా పారిశుధ్య పనులను పంచాయతీ కార్యదర్శి నాగూర్‌బీ ముమ్మరంగా చేపట్టారు. సోమవారం మండల పరిధిలోని కొండాయపాలెం స్థానికులు సమాచారం మేరకు పంచాయతీ నీరు కలుషితం అవుతున్నట్లు నీటి ట్యాంకులు మట్టి పేరు పోవడం దుర్వాసన వస్తుందని సమాచారం అందుకున్న పంచాయతీ కార్యదర్శి వెంటనే స్పందించి సిబ్బందితో పంచాయతీ మంచినీటి ట్యాంకును శుభ్రం చేశారు. అనంతరం ఆమె ప్రస్తుత సీజన్ వ్యాధులపై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సీజన్ వ్యాధులపై వారికి అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలను దోమలు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పలుచోట్ల మధ్యాహ్న భోజనం అందజేత

కోవూరులో దాతలను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కోవూరు

ఇనమడుగు పంచాయతీ పరిధిలోని జెడ్‌పి హైస్కూల్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన “శుభ్ దిన్ భోజన్” (తిథి భోజన్) కార్యక్రమానికి అన్నదాతలుగా వ్యవహరించి గొప్ప అన్నదాన కార్యక్రమం చేపట్టిన ఇనమడుగు గ్రామ నాయకులు పార్లమెంటు రైతు సంఘం కార్యదర్శి కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, ఎంపిటిసి కొల్లారెడ్డి సునీల్ రెడ్డి, యరటపల్లి సునీష్ కుమార్ రెడ్డిలను సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు వారికి కృతజ్ఞతలు చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులున్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : శుభదిన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాతలు రెడ్డప్ప రెడ్డి, హనుమంత రాజు, కస్తూరయ్యలను విద్యాకమిటీ చైర్మన్ దుంపలగడ్డ వెంకటేశ్వర్లు అడిగిన వెంటనే విద్యార్థులకు విరామ సమయంలో వడ, సమోసాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఇఒ ధనలక్ష్మి పాల్గొని మాట్లాడారు. చుంచులూరు ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ఎంఇఒ జొన్నా సత్యనారాయణ వారి సతీమణి విశ్రాంత ఉపాధ్యాయురాలు కంచి అరుణ బిర్యాని, చికెన్ కర్రీ ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో మర్రిపాడు, చుంచులూరు ప్రధానోపాధ్యాయులు పద్మలత, సుధాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో సాహో ఫౌండేషన్ వ్యవస్థాపకులు పడచల నాగేశ్వరరావు, కలిశెట్టి రాజేంద్ర కుమార్, చుంచులూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు రమణయ్య, మర్రిపాడు ఉపాధ్యాయులు చిన్నపరెడ్డి, ప్రసాద్, సుబ్బారెడ్డి, తదితరులున్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : శుభ్ దిన్ భోజన్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం కార్యక్రమాన్ని ఎంఇఒ తోట శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం మండల పరిధిలోని జిల్లా ఉన్నత పాఠశాల బిజ్జంపల్లి పాఠశాలను తనిఖీ చేసి శుభ్ దిన్ భోజన్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం, మనబడి మన భవిష్యత్తు కార్యక్రమాలను పరిశీలించారు. విద్యార్థులకు స్వీట్లు అరటి పండ్లు అందించిన జమ్ముల వెంకటేశ్వర్లును అభినందించారు. అలాగే మనబడి మన భవిష్యత్తు పనుల దగ్గర రెడ్ రిబ్బన్స్, కంచె ఏర్పాట్లు చేసిన ప్రధానోపాధ్యాయులు షేక్.నాయబ్‌ను అభినందించారు. పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్‌ఒ ప్లాంట్ రిపేరునకు రూ.60వేలు విరాళం వచ్చి ఉపయోగానికి తెచ్చిన అంబవరపు బలరామిరెడ్డిని, తిథి భోజనం దాత జమ్ముల వెంకటేశ్వర్లును, ప్రహరీ గోడ నిర్మాణానికి ఇటుకలు ఇసుక ఇస్తామన్న దాత సిద్ధు, వెంకటేశ్వర్లు, అశోక్‌లను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్కు రమణమ్మ, పాఠశాల చైర్మన్ సుందర రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : ముసునూరు 15వ వార్డులోని జెడ్‌పి హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్‌లో సోమవారం “శిక్షా సప్తాహ్” అతిథి భోజనం కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా స్కూలు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డుకు సంబంధించిన టిడిపి నాయకులు ఉప్పు వెంకటస్వామి, బిట్రగుంట వెంకట్రావు ఆధ్వర్యంలో మంచి భోజనం అందించాలని 450మంది పిల్లలకు స్వీట్లు, అరటి పండ్లు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇ రఘు రామయ్య, ఎంఇఒ వెంకటసుబ్బయ్య, టిడిపి నాయకులు కన్నం శ్రీధర్ చౌదరి, లింగం మాల్యాద్రి, సీతారామయ్య, ప్రభాకర్, కరీంబాషా, మహేష్, వెంకటేశ్వ ర్లు, శ్రీను, వరుణ్, శివ,మహేంద్ర పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం శుభ్ దిన్ భోజనంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నల్లపరెడ్డిపల్లిలో వి.మల్లికార్జున రెడ్డి అనే దాత సహకారంతో విద్యార్థులందరికీ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అనంతరం స్నాక్స్ ఇచ్చారు. కార్యక్రమాన్ని సహృదయంతో సహకరించిన మల్లికార్జున రెడ్డికి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తమ అభినందనలు తెలియజేశారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని తిమ్మారెడ్డిపల్లి మెయిన్ ఎంపిపిఎస్ పాఠశాలలో గ్రామ టిడిపి నాయకులు దమ్ము పెద్దయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిక్ష సప్త శుభ్ దిన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం తిథి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ రవణయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.లాసర్, విద్య కమిటీ చైర్మన్ మంజుల, గ్రామ పార్టీ అధ్యక్షులు గోళ్ల వెంగల్‌రావు, దమ్ము మల్లికార్జున, అరుణ రెడ్డి, మాధసూదన్ రెడ్డి, జనసేన నాయకుడు వెంకటేశ్వర్లు, మొహమ్మద్ రసూల్, అంగన్‌వాడీ టీచర్ రజియా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : సంగం జెడ్‌పి హైస్కూల్‌ను సోమవారం డిప్యూటీ డిఇఒ గోపాల్ సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శుభదిన్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సహ పంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ వైస్‌చైర్మన్ తోట భాస్కర్, ఎంఇఒలు జానకీరామ్, మల్లయ్య, హెడ్మాస్టర్ బుజ్జయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం గతవారం రోజులుగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ భాగంగా చివరిరోజు శుభ్ దిన్ భోజన కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమ వారం నిర్వహించారు. ఆత్మకూరులోని పాఠ శాలలో 20వ వార్డు కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు స్వీట్లు, అరటిపండ్లు అంద జేశారు. ప్రిన్సిపాల్ సిహెచ్ అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఒంటేరు మల్లికార్జున యాదవ్‌లతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కొండపిట్ట గ్రామంలో ఉన్న ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం శిక్షాసప్తాహ్ వారోత్సవాలు ముగిసిన సందర్భంగా పాఠశాల విద్యార్థుల కు ఐడి కార్డులు, బ్యాడ్జీలను హెచ్ఎం మద్దులూరి ప్రసాదరావు, సహోపాధ్యాయిని దేగా విజిత ఆర్థిక సహకారంతో విద్యార్థులకు అందజేశారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒలు పి.ఎల్. నరసింహారావు, ఎం.జయమ్మ పాల్గొని వారు మాట్లాడారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : సోమశిల గ్రామంలో హిల్ కాలనీలోని ఎలిమెంటరీ స్కూల్స్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శుభ్ దిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా సోమశిల టిడిపి గ్రామ సీనియర్ నాయకులు ఏగు పెంచలయ్య వారి సతీమణి రాధా ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కట్ల ప్రసూన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మంత్రిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కలిగిరి

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి దోల బాల వీరాంజనేయ స్వామిని ఉదయగిరి నియోజకవర్గం టిడిపి ఎస్‌సిసెల్ నాయకుడు స్వర్ణ కొండయ్య మంత్రి స్వగ్రామం తూర్పు నాయుడుపాలెంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఎస్‌టి 'ఎన్ ఎస్” ఎఫ్ 'డి సి కార్ల లబ్ధిదారులకు జరుగుతున్న నష్టాలు గురించి వివరించారు. పై సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం జరిగేలా చూడాలని స్వర్ణ కొండయ్య కోరారు. కార్యక్రమంలో ఎస్‌సిసెల్ ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరు సుధీర్ బాబు, జి.రామ్మోహన్‌రావు, జి.రమేష్, ఎస్.రమేష్, ఈ.రవి, లక్ష్మణ్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో..
EP NO.6/2024. OS NO.26/2016
రావి రామారావు ---- DHR..
వర్సెస్
గుత్తా మహేంద్ర ---- JDR..
టు
గుత్తా మహేంద్ర
S/O మాలకొండయ్య.
దప్పళంపాడు గ్రామం,
గుడ్లూరు మండలం,
ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా.
పై నెంబర్ పిటిషన్‌లో మీరు ప్రతివాదిగా ఉన్నారు. మీరు పైకోర్టు నుండి అనేక సార్లు పిటిషనరు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున, శ్రీ కోర్టు వారు ఈ నోటీసును పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని ఉత్తర్వులు వేసి, పై నెంబర్ పిటిషన్‌ను తేది 02-08-2024కి వాయిదా వేసియున్నారు. కావున ఆ దినము ఉదయం గం॥ 10:30 నిముషములకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేదా మీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది 02-08-2024.
ఇట్లు
Ch.హరికృష్ణ,
న్యాయవాది, కందుకూరు.